# పీఠిక

(ప్రా మనమడు ఈ నడుమను...ముక్తసరిగా...కలగన్న, కథ)

ఆన 1957 సం॥ జూలై నెలాఖరు లోపుగా ఇలా జరిగి తీరుతుంది.

నేను, వాళ్ళ లక్ష్మిని, ఇప్పటికి షుమారు నాలుగు మాసముల పదిరోజులనుంచీ ప్రేమిస్తున్నానని, మా నాన్నకు ఏమాత్రం ఆచోకీ తెలిసినా, ముందు మా కొంప అంటుకుంటుంది; ఉత్తరక్షణంలో వాళ్ళ కొంప అంటుకుంటుంది; (ఊహుఁ...ఆమాత్రం వ్యవధానంకూడా ఉండదేమో, రెండు కొంపలూ, ఒక్కసారే అంటుకుంటాయి:)

(సరే, మన సంగతి అలా ఉంచి, లక్ష్మికి వచ్చే ప్రమాద మేమిటో ఆలోచించుదాము:)

ఆగ్నేయ పౌరుషేయములు ఈ అయిదారు సంవత్సర ములనుంచీ విచారించి, వాళ్ళ అమ్మా నాన్నా చివరకు ఎలాగయితేనేం సిసలు చేసిన ... ఆ సంబంధానికి లక్ష్మి ఎన్నటికీ ఒప్పుకోదు.

ఒప్పుకోక ఏం చేస్తుందయ్యా. (ఉత్తమోత్తమమైన సాంఘిక నవలలో, కథానాయిక చేసేపనే చేస్తుంది) 'మనసా-వాచా-కర్మణా ఫలానా సుందరుణ్ణి ప్రేమించాను. ఇప్పటికి రమారమి ఆరుమాసములనుంచీ, ఆతడు నా నిలువెల్లా నిండిపోయినాడు; కనుక, ఈ ఒక్క జన్మకే కాదు, దీనితో కలిపి వేయిజన్మలు చెల్లేవరకూ, నాకు మరో సంబంధం అంటూ మీరు విచారించేందుకు వీలులేదు...' అని ఖచ్చితంగా చెప్పేస్తుంది.

తల్లిదండ్రులు ఇద్దరూ పరిపరి విధాల, నయానా, భయానా చెప్పి చూస్తారు. బ్రతిమాలుకుంటారు, ఎవరికి చేతనైనట్లు వారు కంట తడీ, నీరూ పెట్టుకుంటారు; చివరకు విసివి, వేసారి, ఉగ్రులై, ఆ గాలివానలో, చీకటి - అంధకారంలో, వీధి తలుపు ఛెళ్లునతీసి, (తాము ఏకగ్రీవంగా 16 సంవత్సరాలక్రితం కడుపారా-కన్న) కూతుర్ని నిర్దయులై ఇంట్లోంచి వెళ్ళగొడతారు.

ఆ అమ్మాయి, కంటక - పథాన్నిపడి, అడుగులు తడబడుతూపోయి, (ఆమెమీద కనికారంతో,) (ఆ పూట రెండు గంటలు ఆలస్యంగా వచ్చి కాచుకుని పడిఉన్న) మెయిల్‌లో

ఎక్కేస్తుంది...(తరువాత రెండు సంవత్సరాలు, చరిత్రలో అంతా అంధకారం...)

—కాని, నేను ఈ షుమారు ఏడువందల దినములూ, ఆ అమ్మాయిని మరువలేదు. కాని, నాన్నకు వినపడకుండా మనసులో రోజూ జపంచేస్తూంటే గుండెలు రుద్రాక్షల్లాగా గల-గలలాడేవి. కాని, నేను ఎన్నడూ ఆయన కళ్ల ఎదుట పడేట్టూ నిలువునా నీరు కాలేదు.

ముక్కానీకార్డంతమేర, ముప్ఫై పేజీలకు మించిన ప్రేమగీతం వ్రాశాను ఆ అమ్మాయిమీద. అంకితం ఖత్తు కుదరక, అయిదారు పుస్తకాల్లో పేజీలన్నీ పాడుచేశాను. (ఈ శ్రమంతా అనవసరం.) నా జీవితంలో ఈ భాగం, రామాయణం అంత కావ్యంగా పెంచి, ఆమె అడుగు దమ్ములు ఎక్కడున్నాయో ప్రస్తుతం, వెదుక్కుంటూ పోయి, అంకితం అయిపొమ్మని, ఈ నడుమనే తోలేశాను. (కలలో)

నా జీవితము యావత్తూ ధరీ అంతూ లేని సహారాగా మారిపోయింది. కాని, తోవా తెన్నూ లేని ఆ ఇసుకలోపడి నడవగా, నడవగా, ఎన్నో యుగాలు గడవగా, ఏనాటికో ఓనాడు, అమాంతం నా కళ్ళకు, ఆ రేవతి కనబడక తప్పదు.

...పరీక్షలు దగ్గరకు వచ్చాయి. ఈ వారంరోజులూ ప్రేమసంగీతం కట్టిపెట్టాలి. మళ్ళీ జూలైదాకా, ఆహా ఓ, ఆహా ఓ షికారుగా పాడుకుంటూ ఉండవచ్చును—

కాలేజీ తలుపులూ, కిటికీలూ బార్లగా తెరిచారు. అందరిలోకీ నేనే చిక్కి శల్యమై, వేయి తలలపెట్టు విరహ

భారాన్ని ఒంటిచేతిమీద మోస్తున్నందుకు, నన్నుచూసి నా మనసు గర్వించింది.

ఆ ఏడాది, నేను నడపలేదు. అదే నా చెవి మెలేసి పట్టుకుని, పన్నెండుమాసాల బారునా, జర-జరా ఈడ్చుకు వెళ్ళింది...ఆ వెళ్ళడం-వెళ్ళడం యకాయకి పరీక్షల్లోకి వెళ్లింది. పరీక్షలు సజావుగా 'ప్యాస్'లో...

—విశ్వవిద్యాలయం వాళ్ళు, నా కోసం పట్టామీద అక్షరాలు చెక్కిస్తున్నారు. పత్రికవాళ్ళు నా బొమ్మను నిలువుకు-నిలువునా పత్రికల్లోకి ఎక్కిస్తున్నారు. సినీమాల వాళ్లు నేను వేయాలిసిన వేషంకోసం తొక్కిసలాడు కుంటున్నారు.

(చాలా పొరబాటు, ఈ వివరాలన్నీ వ్రాయడం. రెండు సంవత్సరాలూ అంధయుగమని, వెనుక పేజీల్లో ఎక్కడో వ్రాశానన్న సంగతి ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది...ఇంతవరకూ వ్రాసిన ప్రేలాపన అంతా కొట్టి వేసినదాంట్లో జమ. దీన్ని చిత్తు ప్రతిగా భావిస్తున్నాను.)

(ఇంకో గొప్ప పొరబాటు. రెండు సంవత్సరాలని వ్రాశానే, అది శుద్ధ-తప్పు. నేను, కథకు నాయకుణ్ణి కాగల విశ్వవిఖ్యాతి సంపాదించుకునేందుకు, అధమం మరో వారం రోజులైనా ఎక్కువపట్టేట్టు చేయడం, సమంజసము. కనుక-)

అవాళ, ఏం వారమో జ్ఞాపకం లేదు. నిదురమంచం మీంచి లేచి, గుమ్మంలోకి వచ్చి ఆలకింతును కదా, నా పేరు పరిపరి విధాల, రోదసిలో మారుమ్రోగిపోతూంది.

దాని పుట్టంతా మునిగిపోయినట్లు, ఈ వాడనుంచి ఆ వాడ చివరకు 'హాలో' లక్ష్మణా అంటూ అంచె - లంచెలుగా దొర్లుకుపోయే ప్రతి బస్సూ, ఏదో రంగులో, ఏదో ఓ భంగిమలో, నా అంగసౌష్టవాన్ని భరిస్తూంది. ఖాళీగా ఉన్న ప్రతి గోడకూ నాబొమ్మతో పుస్తే కట్టారు. కొన్ని మూర్తులు గోడెక్కి, మేడెక్కి కూర్చున్నాయి. ఊరు మొత్తంమీద, ఎక్కడైతేనేం, నామొగాన, చిన్నా పెద్దా కలిసి, ఓ వెయ్యి దీపాలన్నా వెలిగినవి.

(ఆత్మకథ ఇంత విస్తీర్ణంగా ఘోషించవచ్చునా అనే అనుమానం, ఇప్పుడు బాధించడానికి ప్రారంభించుతూంది. ఇటు మొగ్గు ఎక్కువౌతూంది ... దాళా కట్టాలి. ఇంకో అనుమానం కూడా కద్దు. సినీమా ప్రముఖులు, మొగతార మొగాన ఇంత సొమ్ము తగలవేస్తారా? ... ('తగులవేయుట'లో నైచిత్రికి వేంకటరాయశాస్త్రిగారికి కృతజ్ఞత)... ఈ అనుమానాలు రెండూ, తీరేవికావు, గనుక...)

(—ఇంతకూ చెప్పవచ్చిందేమంటే, అసలు సంగతి చెప్పడం మరిచిపోయినాను. నేను, పట్నంలో ఒక దివ్య భవనంలో దాసదాసీ జనంబులు చామరంబులు వీస్తూండగా రోజూ కొంతసేపు ఉయ్యాల లూగుతూ, కిటికీ కమ్ములలో నుండి చెర్లాటలాడే ప్రకృతిశోభను తిలకించడం నిత్యకృత్యముగా పెట్టుకున్నాను. 'నిజమైన - జీవితం'లో (ఇంగ్లీషులో కాని దీని భావం తెలియదు) నా అందచందాలన్నీ వెండితెరకు అర్పణచేసిన త్యాగినిగనుక, వయసుకు మించిన జ్ఞాన

వృద్ధుణ్ణిగా కనబడుతూన్న మాటలో కొంతవరకు, నిజం లేక పోలేదు...)(నాలో, నాదర్జాలో ఇంతమార్పు రావడానికి కాల పరిమితిఎంతనినిర్ణయించాలో తేల్చుకో లేకుండా ఉన్నాను...)

(మాటల ధోరణిలోపడి లక్ష్మిమాటే మరచిపోతూన్నాను. ఇన్ని పంక్తులు ఆడదిక్కు లేకుండా గడపటం, నడపటం ఛాందసం)

—మళ్ళా ఒకనాడు...ఎన్నో ఏళ్ళకు...ఫోనుగంట మ్రోగడం ప్రారంభించింది ... లక్ష్మిగొంతు; తీగెలమీద ప్రాకివచ్చింది...

నన్నే పిలుస్తూంది అనుకున్నాను. కాని, హతవిధీ! లక్ష్మి నాతో కాదు మాట్లాడుతూంది! తెరమీద చూపిన నా వేషాన్ని పేరెట్టి పిలిచి, కామంలోకి కవ్విస్తూన్నది. తీగెలద్వారా, లక్ష్మి, నాతో మనసారా వ్యభిచరించింది. కొంతకాలం, మా ప్రేమలేఖలు, సకాలంలో జారీచేయలేక తపాలాశాఖ యావత్తూ గగ్గోలెత్తిపోయింది ... (అలంకారాలూ, పదగుంభన, మాంచి పకడ్బందీ పాకములో అమర్చగలిగిన నలుగురు - గజవ్రాతగాళ్ళను, ప్రత్యేకం ఈ పనికోసం ఈ సందర్భంలో మనం జీత-బత్తెము లిచ్చి పోషించడం జరిగిందని చదువరులు గ్రహించే సూచన ఇమడ్చాలి?) - ఇలా కొంతకాలం గడిచింది... (ఛస్. కాలం వృథాగా చాలా దుబారా చేస్తున్నాను కాని, కథ ఇంకా రక్తికీ - రంగానికీ రావడంలేదు. ఇహనుంచీ కొంచెం జరఫ్‌గా నడవాలి.)

నా చేవ్రాలుతో ఉన్న బ్రహ్మాండమైన చిత్రాన్ని లక్ష్మికి బహూకరించాను. (స్త్రీ-తారను కాను గనుక, దస్కత్ నాదికాదనిగాని, దస్తూరి స్వహస్తలిఖితం కాదని గాని, చదువరులు అనుమాన పడేందుకు అవకాశంలేదు )

—ఒకనాడు లక్ష్మి నన్ను వెదుక్కుంటూ వస్తుంది. (నన్నంటే నన్ను కాదు. నేను అద్దెకు ఉంటున్న వీధిలో నా తలుపుమీద ఉండే అంకెను!) నేను అప్పుడే కారుఎక్కి స్టూడియోకు పోతున్నాను. గేటులో ఉన్న ఘూర్కా యోధులు లక్ష్మిని అక్కడ నిలవేయడం గమనించాను. (ఇది ఏ పిక్చర్‌కూ కాపీ కాదుగద!)

మా యిద్దరికళ్ళూ కలుసుకున్నాయి. నేను లక్ష్మిని గుర్తించాను. ఆ అమ్మాయి నేనెవరో బూచాడిని అనుకుంది. (ఆ కంటిమాటను యీ కన్ను అర్థం జేసుకుంది) (తెరమీద నాయకులు నిత్యజీవితంలో అసహ్యంగా ఉండి తీరాలనే అజ్ఞానానికి నన్ను నేను మన్నించుకుంటున్నాను.)

యోధులు నా డ్రైవరుకు సలాముచేశారు. అది నేను అందుకున్నాను. లక్ష్మి చెయ్యి ఎత్తింది, కారు ఆగింది.

'బాబూ, ఫలానావారి భవనం ఇదే కదూ?' అంది కోకిలై: నాకు కోపంవచ్చి జవాబు చెప్పలేదు.

'తాతగారూ, యిదేనా అండీ వారి యిల్లు' అంది బిగ్గరగా, నాకు చెవుడు అనుకుంటూన్నట్లు.

కారు పోనీయమని, తల ఊపాను. ముందుకు ఒక

ఊపు ఊగి, తారురోడ్డు ఎక్కి ఆగింది. (ఎందుకు ఆగింది?- కారణం ఏమిటో (వ్రాయడానికి కొంత ఖాళీ వదలాలి)—

నేను తిరిగి యింటికి వచ్చేటప్పటికి గుమ్మంలో పడు కుని కునికిపాట్లు పడుతూన్న కుక్కపిల్ల, నిద్రమత్తులోనే తోక ఆడిస్తూంది. లోపల హాల్లో, దీపం నీడలో, సోఫాలో పడు కుని ఉన్న లక్ష్మి, వెలుతురు హెచ్చగానే ఒళ్లు విరుచుకో బోయి, (ఒత్తిగిలుతూంది ?–)

ఆ తరువాత ఏం జరిగిందంటే, మరే.....(ఏం జరుగు తుందో తెలియదు; ఇంతవరకూ అధ్యాయాలుగా చించి, బాగా పెంచి, మొదటి భాగంగా ప్రచురించుతాను. మాఆవిడ కాపురానికి వచ్చిన తరువాత నింపాదిగా, మిగతా పేజీలు వ్రాయవచ్చును: రైటో... గో బ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం etc.)

ఎర్రసిరా—

ఎదిగిన పిల్లదాని తండ్రికంట, ఈరాతలన్నీ పడితే... మా కుంకకు, పిల్లను ఎవడిస్తాడండీ? వట్టి అరుపుల గొడ్డు అని, అనుకోడూ: వీడి ఈడు కప్పాడే వీళ్ళనాన్న, కిక్కురు మనకుండా ఆ పరాత్పరుడికన్నా తెలియకుండా ఎంత గ్రంథం నడిపాడో!...కళ్ళ ఎదురుగుండా, ఆ పిల్లది అలా ఉసూరు మంటూా, వీడి పెళ్ళాం కాపురానికి వచ్చి ఓనమాలు దిద్దించే దాకా, సోఫాలో పడుకుని ఉండాలిసిందేనా ?— మావాడు ఒక్కడేనా, లేక ఈకాలం కుర్రకారంతా ఇదే మచ్చా?... పోనీ, ఆ రవంత తరువాయీ, నేను పూర్తిచేతునా?...)